

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## నేను రాను బిడ్డో...

***అది ఒక రమణీయమైన సాయం సంధ్య. పశువులు కసవులు మెసవి, దాహంబులు దీర్చుకుని, గృహంబులకరుదెంచు గోధూళి వేళ కడుంగడు జీకటుల్ ముసిరి...,*** ఎహె, ఎందుకులెండి,మన లాంగ్వేజిలో చెప్పాలంటే పశువులు పొలాలనించి, శీనిగాడు ఊరివాళ్ళ ఇళ్ళనించి ఆటలు పూర్తిచేసుకుని, ఇల్లు ఎక్కడుందో వెతుక్కుంటూ వచ్చే వేళ. ఇంటికొచ్చీ రాగానే అమ్మ ముందస్తుగా ఒక సాంపిల్ రేవు పెట్టేది. తరవాత నేను పెరట్లోకెళ్ళి , కాస్త దుమ్మంతా కడుక్కుని లోపలికొచ్చాకా, శరీరంలో రెండు ఉండవలసినవి, పది ఉండవలసినవి అన్నీ ఉన్నాయో లేదో లెఖ్ఖ పెట్టి, కౌంటు రాసుకుని అన్న వెళ్ళి అమ్మకి నివేదిక సమర్పించేవాడు. అది ఇలా ఉండేది. ***చేతులు => రెండు, కాళ్ళు => రెండు, కళ్ళు => రెండు, కాలివేళ్ళు => తొమ్మిదిముప్పావు, చేతివేళ్ళు => పది అంటూ.***

అప్పుడు మళ్ళీ అమ్మవచ్చి కాలి వేళ్ళు లెఖ్ఖపెట్టి, ఊడిపోతూవున్న చిటికెన వేలుని లోపలేసి కట్టుకట్టి, మళ్ళీ సరదాగా ఇంకో రేవు పెట్టేసి, ఇంకెప్పుడూ ***హ్యూమన్ అనాటమీ*** ని డిస్ట్రబ్ చెయ్యనని ఒట్టేయించుకుని అప్పుడు అన్నం పెట్టేది. మర్నాటికి మళ్ళీ మామూలే.

అదేవిటో, దేవుడు మా అగ్రహారం పిల్లల దెబ్బల వాటా అంతా నా ఎకౌంటులోనే వేసేసాడు, నా జాతకంలోనే రాసేసాడు. అంచేత, రోజుకి కనీసం ఉదయాన్నే చిన్న దెబ్బా, సాయంత్రానికో పెద్ద దెబ్బా కొట్టుకోకపోతే తోచేది కాదు. ఒక రోజు కొత్త పాలిష్టరు చొక్కా, లాగు ఎక్కించి,

***"ఇవాళ ఆటలకొద్దు, రాత్రి నర్తన శాల సినిమాకి తీసుకెడతారు నాన్నగారు"*** అని చెప్పి అరుగు మీద కూర్చోబెట్టింది. నేనూ నర్తనశాలలో లీనమైపోయి, ఊహల్లోనే బాణాలు వేసేసుకుంటున్న సమయంలో, మా సినిమా బండి వాడొచ్చి సమ్మోహనాస్త్రం వేసేసాడు. అంతే, ఆ బండి వెనకాల పరిగెత్తుకుంటూ వెళ్ళి,ఆరు ఇళ్ళ అవతలున్న హిందీ మేష్టారి వీధి అరుగుని శర వేగంతో గుద్దేసాను. అంతే, శనగపిండి రంగు చొక్కా కాస్తా ఎఱ్ఱగా మారిపోయింది. ఏమయిందో తెలిసేలోపు ఎవరో నన్ను సైకిలుమీద ఎక్కించుకొచ్చి మా గుమ్మంలో పడేసి పోయారు. లబో దిబోమని అమ్మ,అన్న కలిసి పక్కనే వున్న సుకుమార్ బాబు గారి ఆసుపత్రి కి

మోసేసారు. ఆయన నా పెదాలకి ఐదు, బెడ్డుకి నాలుగు మొత్తం తొమ్మిది కుట్లేసాడు. రెండు దబ్బనాలు, ఒక గునపం వంగిపోయాయని మనస్తాపం చెందాడు. నేను అరిచిన అరుపులకి ఆయన వెయిటింగ్ రూం లో వున్న జంతువులన్నీ కట్లుతెంపుకుని పారిపోయాయి. అలా పశువుల డాక్టరుతో కూడా వైద్యం చేయించుకుని గట్టెక్కిన బాడీ అయాంబాబుగారిది.

ఓ సారి కాల్లో తుమ్మ ముల్లు దిగింది. ఆ, అయినా ఏముల్లు దిగిందో నేనేవైనా దూరి చూసానా, పాడా. కానీ దానికో లెఖ్ఖుంది.

***" కొంచెం నొప్పెడితే పల్లేరు ముల్లు, ఇంకొంచెం నొప్పెడితే నిమ్మ ముల్లు, తెగ పోటొచ్చేత్తే తుమ్మ ముల్లు"*** అని కొప్పిసెట్టాడు చెప్పాడు. అహలు ఇంట్లో చెప్పకనే పోదును. కానీ తుమ్మ ముల్లుకి ఈతొచ్చుట. అది మెల్లి మెల్లిగా లోపల ఈదేసి గుండెకి చిల్లెట్టేస్తుందట సరిగ్గా గుచ్చుకున్న రెండ్రోజుల్లో. ఇదీ కొప్పిసెట్టాడే  చెప్పాడు. నాకసలే ప్రాణభయం. మనం టపా కట్టేస్తే మన గరల్ ఫ్రెండ్సంతా పాపం బెంగెట్టేసుకుంటారు కదా, అంచేత ఇంట్లో ఒగ్గేసాం. ఎప్పటిలాగే రేవు అనంతరం, వాచిన నా అరికాలు చూసి, వాము కట్టు కట్టేసింది అమ్మ. రెండ్రోజులు పెసరపప్పు అన్నం పెట్టింది. మూడోరోజు డాక్టర్ శ్రీనివాస రావుగారి ఆసుపత్రికి తీసుకెళ్ళింది. డాక్ట్రు గారు ఊరెళ్ళారని కాంపౌండరుగారు నామీద కత్తి దూసారు, ఓ కాలు గెట్టిగా పట్టుకుని. నేను ఆయనమీద నా రెండో కాలు దూసాను. ఆయన వదనం వాపు తగ్గేసరికి వారం పట్టింది. ఇంతలో డాక్ట్రుగారొచ్చేసారు. నా పాదం మీద ఏదో మందు పోసి, నలుగురు జెమా జెట్టీల్లాంటి వాళ్ళని నన్ను గెట్టిగా పట్టుకోమని పురమాయించి, రెండు నిమిషాల్లో ముల్లు లాగి, శుభ్రంచేసి కట్టు కట్టేసారు. ఖర్చు పన్నెండ్రూపాయలు. అసలైతే ఆరే, మిగిలిన ఆరు కాంపౌండరు గారి వాపు తగ్గడానికి, వైద్యానికి అయిన ఖర్చుట. అలా వుండేది అలనాటి సంగతి. మరిప్పుడో...

**"ఏవండీ, మన పిల్ల చెయ్యి కాల్చుకుందండీ..."** అంది ఆందోళనగా, మా ఇంటావిడ ఫోను చేసి.

**"అదేవిటే, పుట్టి ఇంకా ఏడాదైనా నిండలేదు,దానిచేత వంట చేయిస్తున్నావా, నీ బధ్ధకం మండ, తప్పు కాదూ.."** అన్నాను మందలింపుగా.

**"మీ తెలుగు మీడియం సంత కెళ్ళ, చెయ్యి కాల్చుకోవడం అంటే వంట చేసిందని కాదు నా వుద్దేశం, నేను వంట చేస్తోంటే దాని చెయ్యి చురికింది, చెపాతీ మీద చెయ్యేసింది.."** అని కంఠం కాస్త వణికించింది ఎఫెక్టు కోసం..

నాకు డౌటొచ్చి, దబ్బా డవాలు సద్దేసి, ఆరోజుకి బిచాణా కట్టేసి ఇంటికొచ్చేసాను. ముందు పెద్ద శాల్తీని ఓదార్చి, తరవాత చిన్న శాల్తీ చెయ్యి చూసాను. ఆనాటి నా పాదం లాగే కాస్త వాచింది. మధ్యలో పొక్కింది.

**"మరేం పరవాలేదు, వాము కట్టు వెయ్"** అన్నాను హిస్టరీ తలుచుకుంటూ.

**"మీ కూడిక మండినట్టేవుంది. పిల్లకి జెరం కూడా వచ్చిందని డౌటుగా వుందండీ.."** అంది మా శాల్తీ.

ఇంక లాభం లేదని ఇంటి దగ్గర డాక్టరు ***(ట్రెండుకి భిన్నంగా , మనుషుల డాక్టరు)*** దగ్గరికే తీసుకెళ్ళి చూపించాం. ఆయన ముక్కు, చెవులు కళ్ళు అన్నీ పెద్దవి చేసి(ఆయనవి), బావుండదని ఓ మాటు టెంపరేచర్ చూసి,

**"అజ్జి బాబోయ్, పాయింట్ సున్నా రెండు ఎక్కువ వుంది. వెంఠనే ఎమర్జెన్సీకి తీసుకెళ్ళకపోతే మాకు కిట్టుబాటవదు "** అనేసి నాలిక కరుచుకుని, **"ఐ మీన్ వెంటనే తీసుకెళ్ళకపోతే మీకు ప్రమాదం"** అన్నాడు.

సరే ఈ ప్రమాదాన్నించి బయటపడదామని ఊరి నడిబొద్దున వున్న పేద్ద ఎమర్జెన్సీ ఆసుపత్రి గుమ్మంలో వాలిపోయాం. ఇద్దరు అగంతకులు వచ్చి, మమ్మల్ని కారులోంచి లాగి కుర్చీల్లో కూలేసి కారు పట్టుకుపోయారు వాలే పార్కింగ్ అంటూ. అక్కడి నర్సమ్మ కులుకుతూ వచ్చి **"క్యూట్ బేబీ"** అంది నా సంకలో వున్న పిల్లని చూసి. **"సేం టు యూ.."** అన్నాను నేను ఆవిడ బుగ్గ మీద చిటికేసి. ఆవిడ నన్నో వెఱ్ఱి చూపు చూసి, ఇంకో గదిలోకి పరిగెత్తింది, మమ్మల్ని ఫాలో అవ్వమని సైగ చేస్తూ. మేం ఫాలో అయిపోయాం.

అక్కడికెళ్ళాకా ఆవిడ **"ప్లీజ్ అన్ డ్రెస్, నేను రెండు నిమిషాల్లో వస్తాను"** అని లోపలికెళ్ళింది.

నాకు తెగ సిగ్గేసేసింది. నా సిగ్గు చూసి మా ఆవిడకి చిరాకెత్తి డొక్కలో ఒక్క పోటు పొడిచింది,

**"ఆవిడ ఇప్పమన్నవి దాని బట్టలు, వెయిటు గట్రా చూస్తారు కాబోలు, ఎంత సేపూ.. వెధవ ఆలోచనలూ మీరూను.."** అంటూ.

నేను **"నాకూ అదే అనిపించిందన్నమాట, సేం టు సేం..."** అంటూ ఆపని కానిచ్చాను. పిల్ల జుట్టు పొడవూ, గోళ్ళ వెడల్పూ, బుఱ్ఱ వైశాల్యం, డైపర్ బరువూ వంటి పనికిమాలిన కొలతలన్నీ తీసుకుంది నర్సు. ఆవిడ నర్సో, టైలరో అర్థం కాలేదు నాకు. ఆ ప్రహసనం పూర్తయ్యేసరికి గంట గడిచింది. ఆతరవాత ఆవిడ ఆ ఫైలు పుచ్చుకుని,

**"మీరిక్కడే వుండండి, డాక్టరొచ్చి పిలుస్తాడు"** అనేసి మాయవైపోయింది.

కాసేపటికి లోపలనించి డాక్టరొచ్చి ఏదో నోరు తిరగని పేరు పిలిచాడు, ఒక తింగరి ఫామిలీ లోపలికెళిపోయింది. ఇలా ఎంతోమందికి పిలుపొచ్చింది. నాలుగు గెంటలైనా మాకు పిలుపురాలేదు, లోపలినించీ, పైనించీ కూడా. ఇంక కళ్ళమ్మట నీళ్ళెట్టుకుని, వైద్యాన్ని నా చేతుల్లోకి తీసుకుని, ఎదురుగా వున్న కాఫీ మెషీను పక్కనున్న సుగర్ పేకేట్ చింపి, ఆ పంచదారని మంత్రించి మా పిల్ల నోట్లో పోస్తున్న వేళ, ఓ డాక్టర్ దేవుడొచ్చి పిలిచాడు. ఆయన ఆ నర్సమ్మ ఇచ్చిన ఫైలు చదివాడట. అందుకే అలా అయిపోయాడేమో చింపిరి జుట్టూ, పిచ్చి చూపులూ వీడూ, అనుకున్నాను.

వాడు **"మీరు మీ పిల్లా తక్షణం ఇక్కడ ఇన్ పేషంట్లకింద ఎడ్మిట్ అయిపోండి.."** అనేసి అవుటయిపోయాడు.

అంతే, నలుగురు కింకరులు వచ్చి మమ్మల్ని ఎమర్జెన్సీ రూం లోకి లాక్కుపోయారు. పిల్లకి అవేవో సూదులు పొడిచి గ్లూకోజు పెట్టేసారు. మరో నాలుగు గెంటల తరవాత ఎడమ అరచెయ్యికి స్పెషల్ డాక్టరొచ్చి, అన్నీ చూసి,

**"సారీ, లాభం లేదు. ఇదంతా చాలా కంఫ్యూజింగ్ గా వుంది. నేను పుఱ్ఱ చెయ్యి డాక్టర్ని. నేను వెళ్ళి కుడి చెయ్యి డాక్టర్ని పంపిస్తాను, వె హె రీ కన్ ఫ్యూజింగ్ ఐ సే.."** అనేసి వెళ్ళి పోయాడు వాడి అడ్డ బుఱ్ఱ ఇంకా అడ్డంగా వూపుకుంటూ...

ఇంతలో మాకిద్దరికీ పిజ్జాలు, పాస్తాలు పట్టుకొచ్చి బుజ్జగించి తినిపించి వెళ్ళిపోయారు ఇద్దరు అగంతకులు. అర్ధరాత్రి దాటాకా కుడి అర చెయ్యి డాక్టరొచ్చి, ఓ మాటు చూసి, వాము కట్టు కట్టి వెళ్ళిపోయాడు. మర్నాడు రోజంతా ఇదే ప్రహసనం. బేక్టీరియా వన్, వైరస్ టూ, పైథాగరస్ త్రీ, కోపర్నికస్ ఫోర్, బీపీ, సుగరూ తో సహా సమస్తమైన టెస్టులూ చేసుకుపోతున్నారు బొద్దూడని పిల్లకి.

**"చూసారా, ఈ దేశంలో ఎంత కేర్ తీసుకుంటారో. అయాం సో హేపీ, మన పిల్ల సేఫ్ హేండ్స్ లో ఉంది.."** అంది పేలవమైన నవ్వుతో మా శాల్తీ. నవ్వకపోతే బావుండదని నేనూ నవ్వాను. ఇదే అదను చూసి ఒక అగంతకురాలు మా ఫొటో తీసేసి, వెళ్ళేప్పుడు కలెక్ట్ చేసుకోమని ఒక నెంబరిచ్చి వెళ్ళిపోయింది. ఆ మర్నాడు మధ్యాహ్నం కుడి చేతి డాక్టరుగాడొచ్చి, మత్తు మందు జల్లే, ఐ మీన్ ఇచ్చే మరో వైద్యుణ్ణి తోడు తీసుకుని, పిల్లని ఆపరేషన్ థియేటర్కి తీసుకుపోయాడు. అక్కడకెళ్ళాకా డాక్టర్లు కళ్ళూ మొహం తిరిగి పడకుండా ఉండేందుకు వాళ్ళకి బాదాంపాలు, యాపిల్ పళ్ళూ గట్రా తీసుకెళ్ళారు నర్సులు. ఇన్ని ఉపచారాలు చేయించుకున్న పిమ్మట, వాళ్ళు చిన్న గాటెట్టి ఆ చెయ్యి శుభ్రం చేసి, ఒక కుట్టేసి, రెండు కట్లేసి తీసుకొచ్చి అందించారు పిల్లని. డెబ్భై రెండు గెంటల తరవాత ఇంటికొచ్చి పడ్డాము బతుకు జీవుడా అనుకుంటూ .

వారం తరవాత బిల్లొచ్చింది, అక్షరాలా పన్నెండు వేల డాలర్లు. అది కాక మా డిన్నర్లు, ఫొటోలు, వాలే పార్కింగులు అన్నీ అదనం. ఇన్సూరెన్సు కట్టగా మిగిలిన మూడువేల డాలర్లు కట్టేసరికి గుడ్లు బైటికొచ్చి, నన్ను కిందపెట్టినంత పనైంది. ఇదికాక ఇంకా వీలైతే ఫిజికల్ థెరపీ కూడా చేయిస్తే బావుంటుందని దిక్కుమాలిన సలహా ఒకటి. తనది కాకపోతే తాటి మట్టకి ఎదురు దేకమన్నాట్ట ఇల్లాంటి కుంకే.

ఏదో సైన్సు డెవలప్పయిందంటే కామోసనుకున్నాగానీ, పన్నెండ్రూపాయల్ని పన్నెండు వేల డాలర్లు చేసేంతగా డెవలప్పవుతుందని తెలిసేడిస్తే, ఆ డాక్టరీ చదువేదో, నేనే వెలగబెడుదును కాదూ..

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS